మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## సంక్షేమ వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలి

**నారాయణపేట,ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లాలో ప్రభుత్వవసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లాకలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 20నుండి 26వరకు నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా మరికల్‌లోని పీఎం శ్రీ సోషల్ వెల్ఫేర్ పాఠశాల, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్‌కళాశాలలో సంక్షేమ కార్యక్రమాలను పద్ధతిగా అమలు చేయాలని సూచించారు. కిచెన్, స్టోర్‌రూమ్, రైస్‌రూమ్‌లను పరిశీలించి, ఆహారనాణ్యతపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. డైనింగ్ హాల్‌తో పాటు పరిసర ప్రాంతాల పరిశుభ్రతపై కూడా ఆరా తీశారు భవనంలో ఫ్యాన్స్, లైట్స్ వంటి మౌలిక వసతులపై ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సమయానికి ఆహారాన్ని అందించాలని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ, వారి మధ్య కూర్చుని సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్, తహసీల్దార్, ఎంపీడీవో, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను సందర్శించిన కలెక్టర్



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**అచ్చంపేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేటకు సంబంధించిన దేవదారికుంట తండా వద్ద ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి, కేంద్రంలో జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా సమీక్షించిన జిల్లా కలెక్టర్, అక్కడికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. కొనుగోలు ప్రక్రియలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ రైతులను కోరారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్పందించిన జిల్లా కలెక్టర్, కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.2400లు రైతులకు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ సూచించారు. తేమశాతం 14శాతం లోపు ఉండే విధంగా -మిగతా4లో..

## పిడుగు పడి యువకుడు మృతి

**దామరగిద్ద, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం కంసాన్‌పల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. నిడ్జింత గ్రామానికి చెందిన ఈడిగీ శివకుమార్ గౌడ్ (21) పిడుగు పడి మృతి చెందాడు. వివరాల ప్రకారం శివ కుమార్ గౌడ్ తన తండ్రి రామచంద్రయ్య గౌడ్‌కు చేదోడు వాదోడుగా ఉంటూ ఓపెన్ ఇంటర్ చదువుకుంటున్నాడు. మంగళవారం పరీక్ష రాసిన అనంతరం తన మేనత్త గ్రామమైన కంసాన్‌పల్లికి వచ్చాడు. అక్కడ పొలం పనులు చేస్తుండగా అకస్మాత్తుగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన శివకుమార్‌గౌడ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

## పర్యావరణ సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

### వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను జిల్లాకలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెట్ల పెంపకం, నీటి సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు వంటి అంశాల్లో ప్రతి ఒక్కరూ -మిగతా4లో..

## కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలి

- మొదటి నుంచి కాంగ్రెస్ వ్యతిరేకమే..
- మహిళా బిల్లుపై వారికి చిత్తశుద్ధి ఏది..?
- ప్రధాని మోదీకి క్రెడిట్ వస్తుందనే తిరస్కరణ
- 24న మహబూబ్‌నగర్‌కు గవర్నర్ రాక
- మీడియా సమావేశంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

**మహబూబ్‌నగర్‌బ్యూరో, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** 2029లో మహిళలకు చట్టసభలలో 33శాతం రిజర్వేషన్ అందించాలనే ఉద్దేశంతో బిల్లు ప్రవేశపెడితే..కాంగ్రెస్, దానిమిత్ర పక్షాలు వ్యతిరేకించాయి. మొదటి నుంచి కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్ బిల్లు అడ్డుకుంటూనే ఉందని మహబూబ్‌గర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాబీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం లో ఆమె మాట్లాడారు. ఎన్నికల వేళ మహిళా రిజర్వేషన్ గురించి మాట్లాడటం.. తర్వాత తూట్లు పొడవటం వారికి అనాదిగా మారింది. గతంలో ఏడుసార్లు మహిళా రిజర్వేషన్ బిల్లు అడ్డుకున్నారు. మన్మోహన్ సింగ్ హయాంలో రాజ్యసభలో ఆమోదం పొందినా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టలేకపోయింది అది వారి చిత్తశుద్ధి. మహిళా రిజర్వేషన్ అమలు కావాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కి లేదు అని ప్రజలు గమనించాలి. మహిళా రిజర్వేషన్ అమలుకు టిఎంసి, డిఎంకె, ఎస్‌పి, కాంగ్రెస్ కుంటి సాకులు చెబుతూ వ్యతిరేకిస్తున్నారు. డిలిమిటేషన్‌జనాభా ప్రకారం జరిగితే, దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయనే భావాన్ని వ్యక్తం చేసినప్పుడు.. దానిని పరిగణలోకి తీసుకొని.. ఏ రాష్ట్రానికి అన్యాయం జరగకుండా.. భేదాభిప్రాయం లేకుండా 50శాతం సీట్ల పెంపు ప్రతిపాదన చేశారని, 17 స్థానాలు ఉన్నతెలంగాణలో 9స్థానాలు పెంచితే.. 26స్థానాలకు పెరిగేవన్నారు. కేంద్రం సమతు ల్యమైన ఫార్ములా తీసుకువస్తే.. దేశాన్ని విభజించే తీరుగా.. దక్షిణ భారతదేశం, ఉత్తర భారతదేశం అనే భావన ఇండి కూటమి పార్టీలు తీసుకువచ్చా రని, ఈ బిల్లుకు 2/3 మద్దతు కోసం అన్ని పార్టీల మద్దతు పార్లమెంట్ వేదికగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోరారని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసి ఇండి కూటమి మహిళల హక్కును అడ్డుకుందని విమర్శించారు. అన్ని రంగాలలో మహిళలు ముందుకు రావాలని, వికసిత్‌భారత్‌లో మహిళలు రాజకీయ భాగ స్వామ్యంకావాలని కేంద్రం కృషిచేసి.. మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చింది. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మొదటి నుంచి మహిళా అభివృద్ధికోసం కృషిచేసిందన్నారు. జన్ ధన్ ఖాతాలు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ముద్ర రుణాలు, టాయిలెట్స్ నిర్మాణం, మహిళా సంఘాలకు తక్కువ వడ్డీకి రుణాలు, లక్పతీ దీదీ పథకం, స్టార్ట్ అప్‌గా మహిళలను ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. అన్ని రంగాలలో భువి నుంచిదివికి ఎదిగిన మహిళలు.. రాజకీయాల్లో కూడా ఎదగాలని చట్టసభల్లో అవకాశం కల్పించాలని ప్రధాని భావించారని చెప్పారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ముఖం వాడిపోయింది అని ఎద్దేవా చేస్తున్నాడని, బిల్లు వీగిపోవడంతో భారత మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగిందని ప్రధాని నరేంద్ర మోదీ బాధపడ్డారు. మహిళా రిజర్వేషన్ అంశం ప్రతిపక్షాలు కేవలం రాజకీయాల కోసం వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2029 ఎన్నికలలో మహిళా బిల్లు అమలు అయితే వారికి వచ్చే నష్టం ఏంటని ప్రశ్నించారు. మహిళా రిజ ర్వేషన్ బిల్లు, డిలిమిటేషన్ అమలు జరిగితే ప్రధాని నరేంద్ర మోదీకీ క్రెడిట్ వస్తుందనే ఒకే ఒక్క కారణంతో అడ్డుకున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం కల అని, కాంగ్రెస్‌కి అంత అభద్రత భావం ఎందుకుని ఫైర్ అయ్యారు. తెలంగాణలో అధికారం లోకి రావడానికి మహిళలకు అనేక హామీలు ఇచ్చి ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీలన్ని విస్మరించిన కాంగ్రెస్ కు మహిళలు గుణపాఠం చెప్పాలని పిలుపుని చ్చారు. ఏప్రిల్ 24న ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ ముగింపు వేడుక మహబూబ్ నగర్ కు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విచ్చేస్తున్నారు. వారి చేతుల మీదుగా బహుమతుల ప్రధానోత్సవం ఉంటుంది. ఈ కార్యక్రమంలో క్రీడాభిమానులు, ప్రజలు, మీడియా సోదరులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న మహబూబ్ నగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అచ్చుగట్ల అంజయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, బొక్క బాల్ రెడ్డి, కృష్ణవర్ధన్ రెడ్డి, పడాకుల సత్యం, మర్రి జ్యోతి, హరికృష్ణ, కరుణాకర్ రెడ్డి, పద్మావేణి, శివారెడ్డి, శ్రీశైలం, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఆర్డీఓ

**నారాయణపేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఆర్డీఓ రామచందర్ నాయక్ లం చం తీసుకుంటూ ఏసీబీ అధికా రులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబ డ్డారు. బర్త్ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు ఐదుగురు వ్యక్తుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ. 5,000 చొప్పున మొత్తం రూ. 25,000 లంచం తీసుకుంటున్న సమయంలో అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం, బర్త్ సర్టిఫికెట్ల జారీకి ఆర్డీఓ లంచం డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదు రావడంతో నిఘావేసి - మిగతా4లో..



ఎసిబికి పట్టుబడ్డ ఆర్డీఓ



లాటరీ పద్ధతి ద్వారా దుకాణలను కేటాయిస్తున్న అదనపు కలెక్టర్

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దుకాణాల కేటాయింపు

4

### లాటరీ పద్ధతి ద్వారా షాపుల ఎంపిక

### అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు భీమ్యానాయక్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం

## చివరిగింజ వరకూ కొంటాం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**హన్వాడ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండలంలో ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నాయినోనిపల్లి, హన్వాడ గ్రామాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి గింజ వరకూ కొంటాం" అంటూ రైతులకు భరోసా ఇచ్చారు. రైతే రాజు అని, రైతుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఆయన, రైతులు తమ పంటలను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. మధ్యవర్తుల మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రైతులు సంతోషంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి - మిగతా4లో..

## టీచర్ రాయిని వజ్రంగా మార్చగలడు

- డ్రాప్ అవుట్స్ తగ్గించాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచాలి
- డిజిటల్ పుస్తకాలతో సత్ఫలితాలు
- విద్యా సమీక్షలో విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



హాజరైన ప్రధానోపాధ్యాయులు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 21, ప్రభాత వార్త :** టీచర్ తలిస్తే రాయిని కూడా వజ్రంగా మార్చగలరు" అంటూ ఉపాధ్యాయుల పాత్రను విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతిపై ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 19,775 మంది విద్యార్థులు చదువుతున్నారని, మొత్తం 192 ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపవుట్‌లను తగ్గించి, నమోదు (ఎన్రోల్మెంట్) శాతాన్ని పెంచాలని సూచించారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రావీణ్యంతో తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, భవిష్యత్తులో ఆధునిక సాంకేతికత, యంత్రాల ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో చదువుతో పాటు మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించాలని అన్నారు. అపజయాల సమయంలో విద్యార్థులకు అండగా నిలిచి, సానుకూల దృక్పథాన్ని పెంపొందించాలని సూచించారు. విద్యార్థులకు సోషల్ బిహేవియర్, కుటుంబ విలువలు, ఇతరులతో వ్యవహరించే నైపుణ్యాలపై అవగాహన కల్పించాలని, శారీరక శిక్షలు కాకుండా సరైన మార్గదర్శకంతో వారిని సరిదిద్దాలని పేర్కొన్నారు. డిజిటల్ బోర్డులు, డిజిటల్ పాఠ్యపుస్తకాల వినియోగంతో విద్యార్థుల ఫలితాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత శాతం 50 నుంచి 94 వరకు పెరిగినట్లు వెల్లడించారు. శతశాతం" కార్యక్రమాన్ని 8,9 తరగతులకూ విస్తరించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, పాఠశాలల ఇన్ఫ్రాస్ట్రక్చర్ అవసరాల కోసం ప్రత్యేక ఫారమ్ రూపొందించామని, అవసరాలను తెలియజేయాలని సూచించారు. అవసరమైన నిధులను సమీకరించడం తన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించగలరని, దీనికి ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షల ఫలితాలే నిదర్శనమని తెలిపారు. ట్రిపుల్ ఐటీ శిక్షణలో భాగంగా ఉదయం 5గంటల నుంచే బోధన నిర్వహించిన ఉపాధ్యాయుల నిబద్ధతను ప్రశంసించారు. గవర్నమెంట్ బాలికల జూనియర్ కాలేజీలో 992 మార్కులు సాధించడం లెక్చరర్ల కృషి ఫలితమని పేర్కొన్నారు. జిల్లా విద్యాధికారి, ఎయంఓ సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పాఠశాలల సమస్యలపై పూర్తి వివరాలు అందిస్తే తక్షణ చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు వృత్తిపరమైన కోర్సులపై దృష్టి పెట్టేలాగా ప్రోత్సహించా లని, ఈ సంవత్సరం వోకేషనల్ కోర్సుల్లో 1000 మందికి పైగా విద్యార్థులు చేరినట్లు తెలిపారు. ఏటీసీ సెంటర్‌లో 340 మందికి అంతర్జాతీయ ప్రమాణాల శిక్షణ అందుతున్నదని -మిగతా4లో..

## ఈత సరదా కావొద్దు విషాదం

### మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు రావడంతో పిల్లలు, యువకులు చెరువులు, కాలువలు, కుంటల వద్దకు ఈతకు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఈ సందర్భంలో ప్రమాదాలు జరిగి నీటిలో మునిగి ప్రాణనష్టం జరుగుతున్న సంఘటనలు నమోదవుతున్నాయని జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు, ముఖ్యంగా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈత రానివారు బావులు, చెరువుల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని, ఈత నేర్చుకునే వారు తప్పనిసరిగా తల్లిదండ్రుల సమక్షంలోనే నేర్చుకోవాలని తెలిపారు. పిల్లలు చెరువులు, కాలువలు, కుంటల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు వారి కదలికలను గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణ నష్టానికి దారితీయవచ్చని హెచ్చరించారు.

**మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దు...** జిల్లా వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, అనుభవం లేకుండా వాహనాలు నడపడంవల్ల ప్రమాదాలు జరిగి, ఇతరులకు ప్రాణాపాయం కలుగుతున్నదని తెలిపారు. ఒకవేళ మైనర్‌కు వాహనం ఇచ్చి ప్రమాదం జరిగితే లేదా మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే వాహన యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

## గురుకులాల్లో సదుపాయాలపై శ్రద్ధ తీసుకోవాలి : కలెక్టర్

**అచ్చంపేట, ఏప్రిల్, 21 ప్రభాతవార్త :** గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, సదుపాయాల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా కొనసాగుతున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా మంగళవారం అచ్చంపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పాఠశాల ప్రాంగణాన్ని సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్ వంటశాలలు, నిల్వగదులు, తరగతి గదులు, వసతి గృహాల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు పరిశుభ్రత కీలకమని, ప్రతి విభాగంలో శుభ్రతను నిరంతరం పాటించాలని ఆదేశించారు. ముఖ్యంగా వంటశాలలో ఆహారం తయారీ సమయంలో నాణ్యత ప్రమాణాలు, శుభ్రతపై ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, సరైన డైట్ ప్లాన్‌ను అమలు చేయాలని, ఆహార భద్రత విషయంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. నిల్వ గదుల్లో ధాన్యాలు, ఇతర ఆహార పదార్థాలను సురక్షితంగా నిల్వ చేయాలని, గడువు ముగిసిన పదార్థాలు వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులపై దృష్టి సారిస్తూ, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని మరమ్మతులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండాతగినచర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈసందర్భంగా సంక్షేమవారోత్సవాల భాగంగా నేడు నిర్వహిస్తున్న క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మమేకమై ప్రశ్నలు అడిగి సరైన సమాధానాలు చెప్పిన వారిని అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థుల మార్కులను అడిగి తెలుసుకుని, మెరుగైన ఫలితాలు సాధించిన వారిని అభినందిస్తూ, ఇంకా ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, తహసీల్దార్ సైదులు, పాఠశాల ప్రిన్సిపాల్ బాలస్వామి, ఆర్‌ఐ శివకుమార్, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్



వంట గదిని పరిశీలిస్తున్న కలెక్టర్

## అంకితభావంతో పనిచేసిన వారిని కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుంది: ఎమ్మెల్యే

**మూసాపేట్,ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) కార్యదర్శిగా నియమించబడ్డ పోల్కంపల్లి మాజీ సర్పంచ్ యాదయ్యను దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, ప్రజల సేవకు అంకితభావంతో పనిచేస్తున్న నాయకులను గుర్తించి సత్కరించడం ఆనందకరమని తెలిపారు. డీసీసీ కార్యదర్శి పార్టీ బలోపేతానికి, గ్రామ స్థాయిలో కార్యకర్తల సమన్వయానికి చేస్తున్న కృషిని ఆయన



పోల్కంపల్లి మాజీ సర్పంచ్ యాదయ్యను సన్మానిసునతన్న ఎమ్మెల్యే జిఎంఆర్

ప్రశంసిం చారు. ఈ సన్మానం కేవలం వ్యక్తిగత గౌరవమే కాకుండా, సేవాభావంతో పనిచేసే ప్రతి నాయకు డికి కాంగ్రెస్ పార్టీ గుర్తించి ప్రోత్సా హం కల్పిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా డిసిసి కార్యదర్శి యాదయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి ఏదోరకంగా నాయక త్వం లభిస్తుందని గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి కార్యదర్శిగా నియమించినందుకు పార్టీకి నియోజకవర్గం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు పని చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తాటికొండ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**అమరచింత ఏప్రిల్ 20, ప్రభాతవార్త :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అమరచింత పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం అమరచింత మండలంలో పామిరెడ్డి పల్లె, చిన్న కడుమూరు గ్రామాలలో రైతు



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

వేదికల దగ్గర వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతుల కళ్ళలో ఆనందం చూడడానికి రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతుభరోసా, రైతులు పండించిన వరి ధాన్యానికి మద్దతు ధరతోపాటు బోనాసుగా 500రూపాయలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌పార్టీ దేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలన్నిటిని అమలుచేసిందని అన్నారు. అలాగే ఐదు ఎకరాల రైతులకు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలో జమ చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. పామిరెడ్డి పల్లె సర్పంచ్ బాలయ్య, చిన్న కడుమూర్ సర్పంచ్ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి, హనుమంతు నాయక్, బీసి రెడ్డి, జగన్ రెడ్డి, పామిరెడ్డిపల్లి ఉపసర్పంచ్, వెన్నెల మోహన్, మహిళా సమైక్య, ఐకెపి సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ వెంకటయ్య

**లింగాల,ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే అంగన్‌వాడీల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సర్పంచ్ పూజారీ ఈశ్వరమ్మ వెంకటయ్య అన్నారు. మంగళవారం లింగాలలో పోషణ పక్షంలో భాగంగా అంగన్‌వాడి కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మెరుగైన విద్యతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు న్యూట్రీషన్ ఆహారం అందజేస్తారని, పోషకాహార లోపాన్ని నివారణే లక్ష్యంగా పనిచేస్తున్న అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిడిపివో దమయంతి మాట్లాడుతూ మాతా శిశు సంపూర్ణ ఆరోగ్య రక్షణే పోషణ పక్షం లక్ష్యమని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై విజయవంతం చేయాలని అన్నారు. పౌష్టికాహారం గూర్చి వివరిస్తూ ప్రతిరోజూ తినే ఆహారంలో సమతుల ఆహారం ఉండేలా చూసుకోవాలని వివరించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపివో దమయంతి, వార్డు సభ్యులు రాజు, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇందిరా, ఐసిడియస్ సూపర్‌వైజర్ గిరిజ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు కూలి డబ్బులు వెంటనే చెల్లించాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్

**మిడ్జిల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో గల గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలకు కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలని మంగళవారం నాడు ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ మండలంలోని వేముల వల్లబరావు పల్లి కొత్తపల్లి, పసుపుల, మున్ననూరు, అయ్యవారిపల్లి,



ఎంపిడిఓకు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

వెలుగొమ్మల, బోయిన్‌పల్లి, మిడ్జిల్ పలు గ్రామాల్లో గత రెండు నెలలుగా కూలీ డబ్బులు రాక ఉపాధి పనులకు దూరమవుతున్న పరిస్థితి నెలకొల్పిందని ఉపాధి కూలీలకు కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీసం ఉపాధి పనులు జరిగే చోట మంచి నీళ్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, 102 సౌకర్యము లేక వెరైటీ ఎండలో పనులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం వారం ఉపాధి కూలీలకు పని చేస్తున్న వారికి ప్లేసులు చెల్లించాలని తెలిపారు. అలాగే పనిముట్లు పారా, గడ్డపార, గొడ్డలి, కొడవలి లాంటివి పనిముట్లు సరఫరా చేయాలని ఉపాధి కూలీలకు రూ.307 అమలు చేయాలని తెలిపారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో గీతాంజలికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో బాలమణి, లలిత, జయమ్మ, మధు, జంగయ్య, రమేష్, మహేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రలు ప్రారంభం

**దామరగిద్ద, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలంలోని కానుకుర్తి, గత్ప గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు కానుకుర్తి గ్రామ సర్పంచ్ నారాయణ, గత్ప గ్రామ సర్పంచ్ ఆవిటి మల్లమ్మ సంతోష్ కుమార్ ఈ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాల్ రెడ్డి, పుట్టి ఇదప్ప, ఆనంద్, శరణ్ నాయక్, ఎంఎంఎస్‌ఈ జిల్లా అధ్యక్షురాలు అరుంధతి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, బుక్ కీపర్, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కేజీబీవీ బాలికల అద్భుత ప్రతిభ

**మదనాపురం,ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మండల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ) విద్యార్థినులు ఇంట ర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచి మండలానికి గర్వకారణంగా నిలిచారని బీసీ పొలిటికల్ జిల్లా ఉపాధ్యక్షులు గూడుషా అన్నారు. మంగళవారం బీసీ పొలిటికల్ మండల అధ్యక్షులు



విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించిన ఉపాధ్యాయులు

మహేందర్ నాయు డు ఆధ్వర్యంలో కేజీబీవీ విద్యా ర్థినిలు జిల్లా టాపర్‌గా అరుణ, మండల టాపర్ గా యం.రాధిక నిలిచారు. కేజీబీవీ విద్యార్థినిలు ఫార్మా టెక్నాలజీ 30 మంది విద్యార్థిని ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ప్రతిభ చూపిన కెజీబీవీ ఆణిముత్యాలు, క్రమశిక్షణ పట్టుదలతో చదివి ఉన్నంత స్థాయికి ఎదగాలని వారు తెలిపారు. ఇంటర్ ఫలితాలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన కేజీబీవీ విద్యార్థినిలు ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన బాలికలు మెరుగైన ఫలితాలు సాధించడం విద్యా రంగంలో కేజీబీవీల ప్రాముఖ్యతను మరోసారి చాటిచెప్పింది. కేజీబీవీ ఇంచార్జ్ ఎం.అరుణ, ఉపాధ్యాయురాలు రాధిక, వైష్ణవి, విద్యార్థినిల తల్లిదండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, రవికుమార్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ

# పారదర్శకంగా నిర్వహించాలి : కలెక్టర్

**ఉప్పునుంతల, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ఉప్పునుంతల మండలంలోని దేవదారి కుంట తండా గ్రామపంచాయతీ పరిధిలోని మల్లప్ప వాగు వద్ద ఉన్న మార్కెట్ గోదావరి ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చిన మొక్క జొన్న కోనుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు కోనుగోలుచేయాలని కలెక్టర్ సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు ఏర్పడిన నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ రైతులకు సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కలెక్టర్ స్పందించారు. మొక్కజొన్న కొనుగోలు విషయంలో పారదర్శకంగా ఉండాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ముఖ్యంగా ప్రభుత్వ నిర్ణయించిన మద్దతు ధర రూ.2400 లు రైతులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తేమ శాతం 14 శాతం లోపు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

ఉండేవిధంగా పంటను సిద్ధం చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. తేమ శాతం అధికంగా ఉంటే ధర తగ్గే అవకాశాలు ఉన్నందున రైతులు ఈ విషయంలో జాగ్రత్తలు పాటించాలని, మొక్కజొన్న నాణ్యతపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. అలాగే కేంద్రంలో తూకం, నిల్వ, రవాణా వంటి ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా కల్పించాలని, తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి కొనుగోలును వేగవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ తో పాటు అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి, రెవెన్యూ, సొసైటీ అధికారులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో క్షయ వ్యాధి నిర్మూలన

**ఉప్పునుంతల, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్ కోరారు. మంగళవారం మండలంలోని వెల్టూరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పునుంతల వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. టిబి ముక్త్ భారత అభియాన్ గావ్ గావ్ గావ్ షహర్ షహర్ కార్యక్రమంలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లాలో 86 హై రిస్క్ గ్రామాలను గుర్తించడం జరిగింది. మండలంలోని వెల్టూర్ గ్రామంలో భవిష్య భారత్ మొబైల్ హ్యాండ్ హెల్త్ ద్వారా క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారిణి డా. స్వప్న మాట్లాడుతూ 14 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఎక్రే ద్వారా క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు ఉచిత చికిత్స అందిస్తారని, నిక్షయ భూషణ్ ద్వారా నెలకు రూ.1000 అందిస్తారని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థ టోటల్ హెల్త్ అపోలో ఫౌండేషన్ వారిచే పౌష్టికాహార కిట్టు అందిస్తారని రోగులు పూర్తి కాలపు చికిత్స తీసుకోవాలని వైద్య అధికారిణి డా. స్వప్న తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్, ఉప సర్పంచ్



వెల్టూర్‌లో మొబైల్ ఎక్స్‌రే ద్వారా ఛాతీ ఎక్స్‌రే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉప్పరి మల్లయ్య, డాక్టర్ స్వప్న, మాజీ సర్పంచ్ మేడపు జంగయ్య, ఎంపిహెచ్ ఇఓ మధునాయక్, క్షయ వ్యాధి పర్యవేక్షకులు ఎండి ఆరిఫ్ ఖాన్, పుట్ట శరత్ బాబు, ఎం పిహెచ్ ఎస్. ప్రభావతి, ఎంఎల్ హెచ్ పిఎస్ హిమ బిందు, నవ్య, ఐశ్వర్య, రజినీ, వరలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు జగదీష్, భారత్, వార్డు సభ్యులు మౌనిక, నాగరాజు, ఉప్పరి బాల్ రాజు, కృష్ణ, నవ్య, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక రైతన్న

**నారాయణ పేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జలాల్పూర్ గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.లక్ష్మీపతి గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు రైతు వెన్నెముక అని పేర్కొన్నారు. రైతులు పంటల సాగు, పశుపోషణ, నీటి యాజమాన్యం, సాంకేతికత వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించి రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. ఇది ఆరోగ్యానికి, భూమి సంరక్షణకు మేలు చేస్తుందని చెప్పారు భూసార పరీక్షలు చేయించుకోవడం, పంట బీమా తీసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని, అధిక దిగుబడి విత్తనాలు, డ్రిప్ ఇరిగేషన్ వంటి పద్ధతులు నీటి వినియోగాన్ని ఆదా చేస్తాయని వివరించారు. అలాగే బాల్యవివాహాలు, బాల కార్మికత్వం చట్ట విరుద్ధమని, ఆడ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం నేరమని హెచ్చరించారు. మహిళలకు అనేక రక్షణ చట్టాలు ఉన్నాయని తెలిపారు. నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం కొనుగోలు రసీదులను భద్రపరిస్తే



మాట్లాడుతున్న చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మీపతి గౌడ్

నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. పేదవారు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా 15100 నంబర్‌కు కాల్ చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రాజేష్, అనిల్ కుమార్, ఎంఏఓ బాలదినకర్, పంచాయతీ కార్యదర్శి కీర్తి, గ్రామ సర్పంచ్ మహాలింగప్ప, ఉప సర్పంచ్ మధుసూదన్, హెడ్ కానిస్టేబుల్ నందీశ్వర్, కానిస్టేబుల్ జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కేసులో పారదర్శక విచారణ అవసరం

### నారాయణపేట జిల్లా ఎస్పీ డా.వినీత్

**నారాయణపేట,ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో నమోదవుతున్న ప్రతి కేసులో పారదర్శకంగా, పకడ్బందీగా విచారణ చేపట్టాలని జిల్లా ఎస్పీ డా.వినీత్ అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్షించి, వాటిని త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రాపర్టీ నేరాలపై లోతుగా విచారణ చేసి నిందితులను పట్టుకోవాలని సూచించారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాధితుల సౌకర్యార్థం ఇంటి వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సూచించారు. నేరాల నియంత్రణ కోసం విజిబుల్ పోలీసింగ్, నిరంతర పెట్రోలింగ్ చేపట్టాలని అన్నారు. ప్రతి కేసులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. హాట్‌స్పాట్ల వద్ద అవసరమైన



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ డా.వినీత్



హాజరైన పోలీస్ సిబ్బంది

మార్పులు చేయాలని ఆర్ అండ్ బి అధికారులతో సమన్వయం చేయాలని చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, సీఐలు శివశంకర్, రామ్‌లాల్, భగవంత్ రెడ్డి, సైదులు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన సేవలు అందించాలి

### మన్ననూరు పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ కలెక్టర్ బాదావత్ సంతోష్

**అచ్చంపేట,ఏప్రిల్,21ప్రభాతవార్త:** ప్రభుత్వఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ప్రజల ఆరోగ్యసంరక్షణకు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు మెరుగుపడాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరు ప్రభుత్వప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి పనితీరు, వైద్యసేవల, రోగులకు అందుతున్న సదుపాయాలపై సమగ్రంగా పరిశీలన జరిపారు. మొదటగా ఆసుపత్రిలో డాక్టర్, ఇతర వైద్య సిబ్బంది ప్రతిరోజూ విధులకు హాజరవుతున్నారా అనే విషయాన్ని తెలుసుకోవడానికి హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన, విధి నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవల నాణ్యతపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎలాంటి ఆరోగ్యసమస్యలతో ఆసుపత్రికి వచ్చారో, డాక్టర్ పరీక్షలు ఎలా చేస్తు



పిహెచ్‌సి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

న్నారో, చికిత్స పట్ల సంతృప్తి ఉందో లేదో ప్రశ్నించి వివరాలు సేకరించారు. పీహెచ్‌సిలో రోజువారీ అవుట్‌పేషెంట్ల(ఓపీ)సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి వివరాలను ఆన్లైన్‌లో నమోదుచేయాలని, అలాగే రోగులకు ఇచ్చే చికిత్స, మందుల వివరాలను కూడా సక్రమంగా నమోదుచేయాలని వైద్యసిబ్బందికి ఆదేశించారు. రికార్డునిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. తదుపరి ఆసుపత్రిలోని ల్యాబొరేటరీ, మెడికల్ స్టోర్, లేబర్ రూమ్‌వంటి విభాగాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, ఔషధాల నిల్వ, పరిశుభ్రత పరిస్థితులను సమీ క్షించారు. లేబర్ రూమ్‌లో సదుపాయాలు ఎలా ఉన్నాయో పరిశీలించి, గత నెలలో ఎన్ని ప్రసవాలు జరిగాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అలాగే రోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించి, వారికి సమయానుకూలంగా చికిత్స అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. ఆసుపత్రి నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా పని చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట ఐటిడిఏ మేనేజర్ జాఫర్ హుస్సేన్, వైద్యులు, అధికారులు, గ్రామ సర్పంచ్ ఇస్లావత్ మంజుల రాజారం తదితరులు ఉన్నారు.

## డంపింగ్ యార్డ్‌లో భారీ అగ్నిప్రమాదం

**నారాయణ పేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మున్సిపల్ డంపింగ్ యార్డ్‌లో భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనపై మున్సిపల్ సిబ్బంది స్పందిస్తూ, మంటలు ప్రమాదవశాత్తు చెలరేగాయా లేదా ఎవరైనా కావాలనే అంటించారా అనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. మంటల కారణంగా పరిసర ప్రాంతాల్లో పొగమంచు వ్యాపించి స్థానికులు ఆందోళనకు గురయ్యారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



డంపింగ్ యార్డులో చెలరేగిన మంటలు

## ఊర కుక్కల దాడిలో ఆవు మృతి

### దాదాపు రూ.60 వేలు నష్టం

**ఉప్పునుంతల,ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన దెంది సుకుమార్ రెడ్డికి చెందిన ఆవు ఊర కుక్కల దాడికి మృతి చెందినట్లు బాధితుడు పేర్కొన్నారు. వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసుకున్న పశువుల పాకలోకట్టేసి ఇంటికి వచ్చారు. సోమవారం రాత్రి పశువుల పాకలో ఊరకుక్కల దాడికి మృతిచెందగా, మంగళవారం వేకువజామున వెళ్ళి పశువులకు నీళ్ళు పెట్టడానికి వెళ్ళగా ఊర కుక్కల దాడికి తీవ్రంగా గాయాలై తెల్లార్లు కొట్టుమిట్టాడి చనిపోయినట్లు బాధితుడు పేర్కొన్నారు. దాదాపు రూ.60 వేల నష్టం పోయినట్లు పేర్కొన్నారు. గ్రామాలలో ఊర కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరారు. పశువులపై దాడిచేయడంతోపాటు వ్యవసాయ పొలాలకు వెళ్తున్న మనుషుల పైకి దాడి చేసేంత పని చేస్తున్నాయని వెంటనే జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామాలలో ఉన్న ఊర కుక్కల బెడద నుంచి రక్షి ంచాలని ఆయన కోరారు.

## తాగునీటి సమస్యకు పరిష్కారం

### కొత్త బోరు మోటర్ బిగించిన సర్పంచ్ ఉప సర్పంచ్

**నవాబుపేట,ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** గ్రామ అవసరాలకు నూతన పోర్న్ బిగించి గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ ప్రజలకు నీటి వసతి కల్పించారు. మిషన్ భగీరథ నీళ్లు సరిపోక రేకుల చౌడపూర్ గ్రామ పంచాయతీలో మిషన్ భగీరథ నుంచి వచ్చే నీళ్లు ఏ మాత్రం సరిపోకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రహించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఉద్దేశంతో గ్రామ పాలకుల సమక్షంలో నిర్ణయం తీసుకొని సిఆర్ఐ బోర్ మోటారును కొనుగోలు చేసి కురువని కుంట బోరుబావిలో బోరుమోటర్‌ను బిగించి నీళ్లను అందించడం జరిగింది. నేటి సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ అఖిలబాల్‌రాజ్ గౌడ్, వార్డ్‌సభ్యులు వడ్డే అనిత నర్సింలు, వార్డ్ సభ్యులు చేగురి యాదగిరి, కరోబార్ వడ్డే వీరేశ్, కుమ్మరి రాములు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన కేసిరెడ్డి

**భూత్పూర్,ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం తాటిపర్తి, కరివెన, పెద్దతండాలలో మంగళవారం భూత్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వరికొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా కేసిరెడ్డి మాట్లాడుతూ దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ ఆదేశాల మేరకు మంగళవారం వరికొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. రైతు బిడ్డగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతుల బాగోన్నతికి పాటుపడుతున్నారని, రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. రైతులతో పాటు మహిళల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడుతోందని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల నిర్వహిణ, పెట్రోల్ పంపుల నిర్వహణలతో పాటు వరికొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతను ఐకెపి మహిళా గ్రూపులకే కేటాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటిసర్తి సర్పంచి హబీబాఫసియోద్దిన్, కరివెన సర్పంచి నాగరాణి(నాగలక్ష్మి)లతో పాటు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి నాయకులు మాధవరెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఊర్కొండ మండలంలో పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి

### రూ.1.50 లక్షల ఆస్తి నష్టం

**ఊర్కొండ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** ఊర్కొండ మండల పరిధిలోని బాల్యలోక్య తండాలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురి సన సమయంలో పిడుగు పడి రెండు ఆవులు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. తండాకు చెందిన రైతు కేటావత్ చంద్యకు చెందిన ఆవులు మేత మేస్తుండగా, అకస్మాత్తుగా వర్షం కురిసి పిడుగుపడటంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో మృతిచెందిన ఆవుల విలువ సుమారు రూ.1,50లక్షలు ఉంటుందని, తన జీవనాధార మైన పశువులు మృత్యువాత పడటంతో రైతు చంద్య కుటుంబం కన్నీరుమున్నీరైంది. ప్రభుత్వం మరియు పశుసంవర్ధక శాఖ అధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో నష్టాన్ని పరిశీ లించి, తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత రైతు, కుటుంబ సభ్యులు వేడుకున్నారు.



చనిపోయిన ఆవుల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

## ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ


కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ దొడ్ల కవిత

**వీపనగండ్ల ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మండలంలోని గోపాల్ దిన్నె గ్రామానికి చెందిన సర్పంచ్ దొడ్ల కవిత ఉపాధి హామీ కూలీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు మంగళవారం నాడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం కూలీలు పనులకు వెళ్లి పనులు చేస్తున్న క్రమంలో వేసవి ఎండల తీవ్రత వల్ల కూలీలకు దప్పిక వేసి నీళ్లుసరిగ్గా తాగని ఎడల వడదెబ్బ కొట్టి కూలీలకు ప్రమాదం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఆ రకంగా వందరోజుల పనికి వెళుతున్న ఉపాధి కూలీల కు ప్రమాదాలు జరగకుండా దాహంతో ఇబ్బంది పడకుండా నీటిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు కలుపుకొని తాగడం వల్ల తప్పక తీరుతుందని వారి ఆరోగ్యాల రక్షణ కోసం జాగ్రత్త తీసుకోవాల్సిన అవసరం ఉందని కూలీల దగ్గరికి వెళ్లి ఆమె వారికి తెలిపారు.పనుల దగ్గరికి వెళ్లి వాడిని ఆమె పరిశీలించారు.ఎవరికైనా ఎండ తాపానికి గురి అయితే వెంటనే చికిత్స చేయించుకోవాలని ఆమె కూలీలకు వివరించారు.ఆమె వెంట ఉపసర్పంచ్ వెంకటయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి కర్ణాకర్,సీనియర్ మేటు శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

◆ కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి


వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన దృశ్యం

**దేవరకద్ర,ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** రైతులు తమ పంటను దళారులకు విక్రయించవద్దని, ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి, ధాన్యం కొనుగోలు చేస్తుందని కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి అన్నారు. కౌకుంట్ల మండల కేంద్రంలోని ముచ్చింతల గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాలో పడతాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గ్రేడ్ ఏరకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2389 సాధారణ రకం క్వింటాల్ కు రూ. 2350 మద్దతు ధర ఇస్తామన్నారు. సన్నారకంధాన్యం క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ప్రధాన ధ్యేయమని మండల అధ్యక్షులు అన్నారు. రైతుల తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోకుండా, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్మాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ కథలప్ప ముచ్చింతల సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, కురుమూర్తి చైర్మన్ గోవర్ధన్‌oడ్డి, ఏవోశివకుమార్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యవర్తుల అవసరం లేకుండా నేరుగా ప్రభుత్వం కొనుగోలు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**మదనాపురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** వరి కొనుగోలు మధ్యవర్తుల అవసరం లేకుండా రైతులు నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తమ పంటను విక్రయించవచ్చని మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ అన్నారు. మంగళవారం దంతనూర్,శంకరమ్మ పేట,నెల్విడి,నర్సింగపురం, గ్రామాలలో వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల నాయకులు కలిసి ప్రారంభించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు సరైన ధరలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మధ్యవర్తుల అవసరం లేకుండా రైతులు నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తమ పంటను విక్రయించవచ్చని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, వ్యవసాయం లాభదాయకంగా మారేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని ప్రభుత్వం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కో ఆర్డినేటర్ చుక్క మహేష్, సర్పంచులు నాగరాజ్ గౌడ్, శ్రీనివాస్ చారి, మండల నాయకులు వేమన్న, వెంకటనారాయణ, టిసీ నాగన్న, హనుమన్ రావు, సత్య శీలారెడ్డి, గజ్జెల నాగన్న, శ్రవణ్ కుమార్, రమేష్ యాదవ్, వెంకటన్న, రాజవర్ధన్ రెడ్డి, మన్యంకొండ,గుగ్గిల రాములు, కృష్ణయ్య, దావీదు, కొండన్న తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

■ దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి

**దేవరకద్ర, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే రైతులు ధాన్యం విక్రయించాలని దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి అన్నారు. దేవరకద్ర మండలం బస్వాయిపూర్, గద్దె గూడెం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి మండల అధ్యక్షులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సౌకర్యాలు కల్పించే దిశగా కొనుగోలు కేంద్రాన్ని మండల అధ్యక్షులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటను ఎటువంటి ఇబ్బందులు లేకుండా విక్రయించుకునే విధంగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బస్వాయిపూర్ సర్పంచ్ శేఖర్ రెడ్డి, నార్లోనికుంట్ల సర్పంచ్ రామ్‌రెడ్డి, ఏపీఎం సునీత, విలేజ్ సెక్రటరీ రాఘవులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, నర్సింలు, గద్దెగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ జాఫర్, సత్యనారాయణ, వేణుగోపాల్ ,పూర్ణిత ,రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేతన్నలకు చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న దృశ్యం

**నారాయణ పేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేతన్నలకు ఆర్థిక సాయం అందించారు. నారాయణపేట నియోజకవర్గానికి చెందిన 889 మంది నేతన్నలకు నేతన్న భరోసా" పథకం కింద రూ.26 లక్షల 91 వేల విలువైన చెక్కులనుపంపిణీ చేశారు. అదేవిధంగా నేతన్న బీమా" పథకం కింద 5 మందికి రూ.25 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ మెంబర్ కుంభం శివకుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్వేత సత్య యాదవ్ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేష్, కౌన్సిలర్లు గొల్లరవి, రాజేష్ ఘట్, అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావ సభకు కదలిరండి

గోడపత్రికలను ఆవిష్కరించిన తెలంగాణ జాగృతి నాయకులు నెట్టెంపాడు గోవిందు



**ధరూర్ ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్రంలో నూతన రాజకీయ శక్తిగా ఈ నెల25న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవిర్భవించే నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావ సభకు పెద్ద ఎత్తున కదలిరావాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి ధరూర్ మండల అధ్యక్షుడు,తెలంగాణ జాగృతి నాయకులు నెట్టెంపాడు గోవిందు పిలుపునిచ్చారు. మంగళవారం ధరూర్ మండల కేంద్రంలోని నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో సమితి నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావ సభ గోడ పత్రికలను వారువిడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై ప్రశ్నించే గొంతుకగా బడుగు,బలహీన వర్గాల కోసం, అమరుల ఆశయ సాధన కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కృషి చేస్తున్నారని వారు తెలిపారు. తెలంగాణ గడ్డపై రాబోయే రోజుల్లో నూతన రాజకీయ శక్తిగా పెద్ద ఎత్తున ఆవిర్భవించే సభకు ప్రజలు తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి, తెలంగాణ జాగృతి జిల్లా నాయకులు వెంకట్రాములు,మండల ఉపాధ్యక్షులు అడివిఆంజనేయులు,మల్దకల్, మునెప్ప, ఆంజనేయులు,మండలకార్యదర్శి రాము, మండల నాయకులు వెంకటేష్, సుదర్శన్,శాంతన్న, వీరన్న, ఆంజనేయులు, గోవిందు,కృష్ణ,మద్దిలేటి,తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు జనరల్ నాలెడ్జిపై దృష్టి పెట్టాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ◆ సంక్షేమ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుతో పాటు జనరల్ నాలెడ్జి పై కూడా దృష్టి పెట్టి అన్ని అంశాలపై సమగ్ర పరిజ్ఞానం సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో క్విజ్‌వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ క్విజ్ పోటీలలో వివిధ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల నుండి మొత్తం 5 జట్లు పాల్గొన్నాయి. ప్రతి జట్టులో 5 మంది చొప్పున మొత్తం 25 మంది విద్యార్థులు క్విజ్ లో, వ్యాసరచనలో 25 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి , అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ హాజరై విద్యార్థులకు ప్రశ్నలు అడిగి,సరైన సమాధానాలు చెప్పిన వారిని అభినందించారు. క్విజ్ పోటీలలో మహాత్మ జ్యోతి బాపూలే విద్యార్థులు మొదటి స్థానంలో నిలవగా, తెలంగాణ సాంఘికసంక్షేమ పాఠశాలవిద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. అలాగే వ్యాసరచన పోటీలలో ఏఐపాత్ర అనేఅంశంపై ఉత్తమంగా రాసిననికిత,అక్షిత, నికిత, విజయమని విద్యార్థులను ప్రశంసించారు.విజేతలైన వారందరికీ కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు జనరల్ నాలెడ్జి పై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. ఇలాంటి క్విజ్ కార్యక్రమం విద్యార్థులలో పోటీ భావనను పెంపొందించడమే కాకుండా, వారి జ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికిదోహదపడిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు ప్రపంచ భూమి దినోత్సవానికి సంబంధించిన పోస్టరునుఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిఅబ్దుల్ ఘని,ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాచాలపల్లి పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్


ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**ఊర్కొండ, ఏప్రిల్21 ప్రభాతవార్త:** ఊర్కొండ మండల పరిధిలోని రాచాలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాన్ని జిల్లా అదనపు కలెక్టర్ మంగళవారం సందర్శించారు. వనంలోని మొక్కల పెంపకం, నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో అదనపు కలెక్టర్ స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడంలో పల్లె ప్రకృతి వనాలు మణిహారాల వంటివని కొనియాడారు. వనంలో నాటిన ప్రతి మొక్కను జాగ్రత్తగా కాపాడాలని, మొక్కల సంరక్షణలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించాలని, పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగాలని సూచించారు. గ్రామాలను పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ వనాల నిర్వహణలో స్థానిక ప్రజలను కూడా భాగస్వామ్యం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో రాచాలపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇంద్ర, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వెంచర్‌కు ఇసుక ఫుల్.. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక నిల్


పట్టణాల్లో వెలిసిన ప్రైవేటు వెంచర్లకు తరలిస్తున్న ఆన్లైన్ ఇసుక ట్రాక్టర్లు

**ఉప్పునుంతల, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** దొంగ వివాదం నుంచి దుందుభి వాగు నుంచి అక్రమంగా వెలిసిన వెంచర్ల కు ఇసుక ఫుల్ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక నిల్ ఆన్లైన్ ద్వారా సరఫరా అవుతున్న ఇసుక నియోజకవర్గం లో ఏర్పడిన వెంచర్ల కు భారీ సంఖ్యలో ఇసుకడంపు చేస్తున్నారు. పేదల అందిస్తున్న ఇందిరమ్మ పథకం కింద నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇసుక కోసం నాన్న తంటాలు పడుతున్నారు. పట్టణాలలో వెలిసిన వెంచర్లకు ఆన్లైన్ పేరిట భారీ సంఖ్యలో ఇసుకను నేరుగా తరలిస్తున్నారు. ఆన్లైన్ ద్వారాఇసుక బుకింగ్ చేసుకున్న లబ్ధిదారులకు సమయానికి రాకుండా వారి ఇష్టానుసారంగా వెళ్తున్నారు. కొంతమంది వెంచర్ యజమానులు,అధికారులు,నాయకులు పలుకుబడి సాధించి ఆన్లైన్ ద్వారా బుకింగ్ చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను ఏకంగా ఆన్లైన్ రద్దు చేసుకొని వెంచర్లలో నింపుతున్నారు.అధికారులు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నప్పటికీ ఆన్లైన్ ట్రాక్టర్లు లబ్ధిదారునికి ఇసుకను తరలించకుండా వెంచర్లకు తరలిస్తున్నారు. పేదలు నిర్మించుకునే ఇండ్లకు మాత్రం ఆన్లైన్ పనిచేయదు, అధికారులు సహకరించారు. పలుకుబడి పరపతితో ఉన్న వ్యక్తులకు మాత్రం సమయానికి అనుకూలంగా ఆన్లైన్ఇసుక ట్రాక్టర్లు తరలిస్తున్నారు.ఆన్లైన్ బుకింగ్ చేసుకున్న సమయానికి లబ్ధిదారునికి చేరవేయకుండా సాయంత్రం వేళల్లో బుకింగ్ చేస్తున్న వారికి వెళ్లడానికి ఆన్లైన్ ట్రాక్టర్ డ్రైవర్లు ప్రయత్నం చేస్తున్నారు.ఎంత పటిష్టంగా నిర్ణయాలు తీసుకున్నప్పటికీ ఆన్లైన్ పేరిట ప్రైవేటు వ్యాపారులకు తరలించడం విడ్డూరంగా ఉందని ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు వాపోతున్నారు.ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రవేటు వ్యక్తులకు, వెంచర్లకు ఆన్లైన్ ట్రాక్టర్లు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు రాజన్న

**కల్వకుర్తి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** రాష్ట్రపతి ఉత్తర్వులు వెంటనే రద్దు చేసిదళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు రాజన్న డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని పరిణయం ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం దళిత క్రైస్తవుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు ఆధ్వర్యంలో నియోజకవర్గ దళిత క్రైస్తవుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి నాగర్‌కర్నూలు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పి.రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సుప్రీం కోర్ట్ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వర్తించదని తీర్పు వెలువరిస్తే అన్ని రాజకీయ పార్టీలు మౌనం వహించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ దళిత క్రైస్తవులకు అండగా ఉండి పోరాడుతానని పిలుపునిచ్చారని పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగ పిలుపుతో జిల్లాలో ఉన్న ఎమ్మార్పీఎస్ నాయకులు కూడా మీకు అండగా ఉంటామని తెలిపారు. దళిత సిక్కు, బౌద్ధులకు మినహాయింపు ఇచ్చినట్టే దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని అన్నారు. దేశంలో క్రైస్తవం రాకముందు ఏవిధమైన వివక్ష ఉన్నదో నేటికి అదే వివక్ష కొనసాగుతుందన్నారు. బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, వైశ్య కులస్తులు క్రైస్తవ మతంలోకి వెళ్తే సామాజిక హోదా మారినప్పుడు కేవలం దళితులకు మాత్రమే ఎందుకు హోదా మారుతుందని ప్రశ్నించారు. అందుకే దళిత క్రైస్తవులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పోరాడి ఎస్సీ హోదా సాధించుకుందామని పిలుపునిచ్చారు. దళిత క్రైస్తవులపై అమలులో ఉన్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని లేదా వాటి పరిధి నుండి దళితులను మినహాయించాలని ఈ ఉత్తర్వులు దళితులకు రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు ఆర్టికల్ 14,15,25 లకు పూర్తిగా విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు తమ ఇష్టానుసారంగా మతాన్ని ఎంచుకునే హక్కు కలిగి ఉండాలని, ఇతర వర్గాలైన ఓ సి బి సి ఎస్ టి లకు లేని మత పరిమితులు కేవలం ఎస్సీలకే ఎందుకువిధిస్తున్నారో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు పూర్తిగా అసమానతలను ప్రతిబింబిస్తున్నాయని, చారిత్రాత్మకంగా దళితుల విద్య ఆరోగ్య పురోగతిలో క్రైస్తవ మిషనరీలు కీలకపాత్ర పోషించిన నేపథ్యంలో మతం మారినందుకు దళితులను శిక్షించేలా ప్రభుత్వ విధానాలు ఉండకూడదని స్పష్టం చేశారు.ఏ మతంలో ఉండాలనేది వ్యక్తిగత నిర్ణయం అని దానిపై ఆంక్షలు విధించే హక్కు ఎవరికీ లేదన్నారు.అంబేద్కర్ స్ఫూర్తితో మందకృష్ణ మాదిగ నాయకత్వంలోఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో దళిత క్రైస్తవుల హక్కుల పోరాట సమితి సభ్యులు, ఎమ్మార్పీఎస్ తాలూకా అధ్యక్షులు పర్శపాకుల శేఖర్, అరుణ్ కుమార్, యోహాన్, నందు, శ్రీకాంత్, శేఖర్, ఆనంద్, జ్యోతి ప్రసాద్, శివరాం ప్రసాద్, పాస్టర్లు లూకాస్, రామస్వామి, జేబి రాజు, సృజన్ వివిధ మండలాల పాస్టర్స్ సంఘ పెద్దలు యూత్ తదితను పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ పంటలపై అధిక ప్రోత్సాహకాలు

● జిల్లా వ్యవసాయ అధికారి అంజనేయులు


మాట్లాడుతున్న జిల్లా అధికారి ఆంజనేయులు

**ఆత్మకూర్ ఏప్రిల్ 21, ప్రభాతవార్త;** రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఇతర వాణిజ్యాల పంట కంటే కూడా ఆయిల్ ఫామ్ పంటలపై అధిక ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని వనపర్తి జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు అన్నారు. మంగళవారం రోజు ఆత్మకూరు మండలంలోని ఆరేపల్లి గ్రామంలో గల రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఆయిల్ ఫామ్ రైతులతో ప్రత్యేక సమావేశాన్ని ఆత్మకూరు మండలవ్యవసాయ అధికారి అరవింద్ ఏర్పాటు చేయడంతో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి జిల్లా వ్యాపితంగా గతంలో కంటే ఆయిల్ ఫామ్ పంటలు పండించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని యుద్ధ ప్రాతికరమైన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లుగా ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇతర వాణిజ్య పంటలకు అందజేసే ప్రోత్సాహాల కంటే ఆయిల్ ఫామ్ పండించే రైతులకు వ్యవసాయ సబ్సిడీలతో పాటుగా అధిక లాభాలు పొందేందుకు అవకాశం ఏర్పడుతుందని ఐదు ఎకరాల పైబడి ఉన్న ప్రతి రైతు కూడా రాయల్ ఫామ్ పంటనుపండించేందుకు ముందుకు రావాలని ఆయనవిజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా ఉద్యానవన అధికారి సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతము వనపర్తి జిల్లాలో290 ఎకరాలలో మాత్రమే ఆల్పా సాగు చేయడం జరుగుతుందని రాబోయే ఖరీఫ్ సీజన్లో 500 ఎకరాలకు పెంచడమే లక్ష్యంగా ఆయిల్ ఫామ్ పండించే రైతులు ఇతరులకు ప్రోత్సహించే విధంగా చీరలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆయిల్ ఫామ్ పండించే రైతులకు యుద్ధ ప్రాతిపదికన కోతలు చేయడమే కాకుండా 24 గంటల్లోగా పంటకు సంబంధించిన గిట్టుబాటు ధరలతో పాటుగా రైతులు అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆయిల్ ఫామ్ పండించే రైతులు, వ్యవసాయ అధికారులు తదితరులతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**రాజాపూర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** రాజాపూర్ మండలంలోని కుత్నేపల్లి గ్రామ పంచాయతీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప సర్పంచ్ మణెమ్మ బంద్యా నాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రూప్ సింగ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్ అధ్యక్షులు తిరుమలేష్, ఇందిరమ్మ కమిటి సభ్యులు శ్రీను నాయక్, వెంకటేష్, దూల్యా నాయక్ తదితరులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి బిఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి మంగళవారం వారికి గులాబీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సేవ్యనాయక్, మాజీ వార్డు మెంబెర్లు రాంసింగ్, శేఖర్, ప్రవీణ్, శంకర్ పాల్గొన్నారు.

## వాగ్దేవి అంటేనే ప్రభంజనం

■ జేఈఈ మెయిన్ పరీక్ష ఫలితాలలో సంచలనం


విద్యార్థులను అభినందించిన కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు

**మహబూబ్‌గర్ ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారు విడుదల చేసిన జేఈఈ మెయిన్ పరీక్ష ఫలితాలలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వాగ్దేవి ఐఐటి అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు ఈ ఫలితాలలో విద్యార్థులు జోగు శివ, ముజామిల్ అలీ, స్ఫూర్తిరెడ్డి, కౌశిక్,వర్ష, అక్షయ కీర్తి, శైలజ, వెంకటేష్అత్యుత్తమ పర్సంటైల్ సాధించి అడ్వాన్స్ కు ఎంపికయ్యారు. వీరిని కరస్పాండెంట్ విజేత వెంకట్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా విజేత వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఇన్నోవేటివ్ సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్ తో సాధారణ విద్యార్థులు సైతం అసాధారణ ప్రతిభ కనబరిచి అద్వితీయ విజయం సాధించడం చాలా ఆనందంగా ఉందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇదేవిధంగా కష్టపడుతూ జేఈఈ అడ్వాన్స్ లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులకు జిల్లాకుమంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఐఐటి, నీట్ అకాడమీ ఇంఛార్జ్ పావనిరెడ్డి, యాజమాన్య సభ్యులు రాఘవేంద్రరావు, శివ కుమార్, నాగేందర్, మేగ్య నాయక్, సతీష్ రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ప్రమాదాలను నివారించడమే ప్రధాన లక్ష్యం: ఎస్ఐ జలంధర్ రెడ్డి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై జలంధర్ రెడ్డి

**పెద్దమందడి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** పెద్దమందడి పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్వాల గ్రామ చౌరస్తాలో పెద్దమందడి ఎస్ఐ జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రహదారులపై ప్రయాణించే వాహనదారులను ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జలంధర్ రెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెడుతున్నారని ఎస్సై తీవ్రంగా హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని చిన్నారుల నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని గుర్తు చేశారు ప్రజలు పోలీసులకు సహకరించి సురక్షిత రవాణా వ్యవస్థకు తోడ్పడాలని కోరారు.

## సర్వే సామాగ్రి పంపిణీ చేసిన తహసీల్దార్


సర్వే సామాగ్రి పంపిణీ చేస్తున్న తహసీల్దార్

**మల్దకల్ ఏప్రిల్ 21, ప్రభాతవార్త;** గుణాత్మకమైన, ఖచ్చితమైన, సమగ్ర సమాచార సేకరణకు సహానుభూతి, సత్సంబంధాలు, సమాచార గోప్యత అనే అంశాలు కీలక పాత్ర పోషిస్తాయని మల్దకల్ తహశీల్దార్ ఝాన్సిరాణి అన్నారు.మూడు రోజుల జరిగిన గ్రామాలలో ఎన్యుమరెటర్లు,సూపర్వైజర్ల శిక్షణా కార్యక్రమం మంగళవారం ముగింపు సమావేశంలో శిక్షణార్థులు మాట్లాడుతూ ఇండ్ల జాబితా ఇండ్ల గణనకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర అవగాహన ఏర్పడిందని, శిక్షణాలో థియరీ మాత్రమే కాకుండా ట్రైనర్ లు నరేష్, రామాంజనేయులుగౌడ్ లు ప్రాక్టికల్ గా 24 ఇండ్లను సర్వేచేయించడం ద్వారా సందేహాలన్నీ నివృత్తి అయ్యాయని,వచ్చేనెల11 తేదీన ప్రారంభమయ్యే కార్యక్రమానికి అంతా సిద్ధంగా ఉన్నామని అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.ఎన్యుమరేటర్, సూపర్వైజర్లకు సర్వే సామాగ్రి,గుర్తింపు కార్డులు సరఫరా చేశారు. అందరూ సేవా ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి హరికృష్ణ,టెక్నికల్ అసిస్టెంట్ గోపాల్, ఎన్యుమరెటర్లు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

## సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**బిజినేపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** లట్టుపల్లి సర్పంచ్ మారేపల్లి శివలీల చంద్రగౌడ్ కుటుంబాన్ని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పరామర్శించారు. మారేపల్లి చంద్రగౌడ్ తండ్రి మారేపల్లి శ్రీనివాస్‌గౌడ్ మృతి చెందిన విషయంతెలిసి సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించి భరోసా కల్పించారు. శ్రీనివాస్ గౌడ్ మృతదేహానికి పూలమాలలు వేసి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మిద్దెరాములు,కొండానగేష్,గంగన మోని తిరుపతయ్య, నరేందర్‌గౌడ్, రామన్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## నేడు పెద్దమందడి మండలానికి ఎమ్మెల్యే రాక

**పెద్దముందడి, ఏప్రిల్21 ప్రభాతవార్త:** పెద్దమందడి మండలంలోని ఐకెపి ఆధ్వర్యంలో నేడు బుధవారం వెల్టూరు గ్రామంలో ఉదయం 9 గంటలకు వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి, ఎంపీ మల్లురవి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హాజరవుతున్నట్లు ఏపీఎం సక్రునాయక్ తెలిపారు. అదే విధంగా పెద్దమందడి మండలం కేంద్రంలోని వివిధ గ్రామాల్లో వరికోను కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమానికి వనపర్తి మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని వారు కోరారు.

## టీచర్ రాయిని వజ్రంగా మార్చగలడు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

చెప్పారు. పాలిటెక్నిక్ కళాశాలలో మంచి సాంకేతిక విద్యా అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు గణితం, సైన్స్ విషయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు విద్యా,పారిశ్రామిక పరమైన పర్యటనలకు కోసం ఎస్‌డీఎఫ్ నిధులతో ఒకబస్సు ఏర్పాటుచేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని, ఈ విద్యా యజ్ఞానికి అందరూ చేయూత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, ఎఎంఒ దుంకుడు శ్రీనివాస్, సియంఒ సుధాకర్ రెడ్డి, జగపతి రావు, ఫరూక్ హుస్సేన్, వెంకట నర్సయ్య, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## చివరిగింజ వరకూ కొంటాం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

సారథ్యంలో రైతు సంక్షేమానికి ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. రైతుల ఆర్థిక భారం తగ్గించేందుకు రూ.2 లక్షల వరకు రుణ మాఫీ అమలు చేసి ఉపశమనం కల్పించామని తెలిపారు. రైతు బంధు పథకం ద్వారా పెట్టుబడి సహాయం అందిస్తున్నామని, కౌలు రైతుల కోసం ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి రైతు సంక్షేమ చర్యలు కీలకమని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గన్నీ బస్తాలు సమృద్ధిగా సిద్ధంగా ఉంచాలని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి , హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, నవనీత, యాదిరెడ్డి, సర్పంచ్లు బొట్టు శ్రీను, శ్రీను నాయక్,ఇస్నాతిసుధాకర్,నాయకులు టంకరకృష్ణయ్య యాదవ్, తిరుపతయ్య, షబ్బీర్ హుస్సేన్, మోహన్, క్రిష్ణ, ఎం.నర్సింహులు, వెంకటయ్య, బొక్కి రాములు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దుకాణాల కేటాయింపు



లాటరీ పద్ధతి ద్వారా దుకాణాలను కేటాయిస్తున్న అదనపు కలెక్టర్

**వనపర్తి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** పట్టణంలోని నూతన సమీకృత మార్కెట్ లో గల 32 దుకాణాలు,ఒక సూపర్ మార్కెట్, ఒక బ్యాంకెట్ హాల్‌ను లాటరీ పద్ధతి ద్వారా అత్యంత పారదర్శకంగా నిర్వహించి, దుకాణాలను కేటాయించినట్లు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ వెల్లడించారు. మంగళవారం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లోని దుకాణాల కేటాయింపు కోసం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతి ద్వారా దుకాణాల కేటాయింపు కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 32 దుకాణాలు, ఒక సూపర్ మార్కెట్, ఒక బ్యాంకెట్ హాల్ కోసం 318 దరఖాస్తులు రాగా, వచ్చిన దరఖాస్తులకు అత్యంత పారదర్శకంగా లక్కీ డ్రా పద్ధతిలో దుకాణాలను కేటాయించడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ రావ్ , డిఎం స్వరణ్ సింగ్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్‌శ్రీనివాస్‌గౌడ్,ఇతరఅధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఆర్డీఓ

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పట్టుకున్నారు. మొదట ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.7, 500 డిమాండ్ చేయగా, చివరికి రూ.5,000కు ఒప్పుకున్నట్లు తెలి పారు. ఈ ఘటన నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఆర్డీఓ కార్యాల యంతో పాటు నారాయణపేటలోని బాబా కాలనీలో ఉన్న నివాసంలో సోదాలు నిర్వహించారు.ఈ ఘటనతో అధికారుల్లో కలకలం రేగింది. ఈ సందర్భంగా డీఎస్పీ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫేస్బుక్ ట్యూటర్ ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## పర్యావరణ సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

**మొదటి పేజీ తరువాయి భాగం..**

చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించేందుకు సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందిపాల్గొన్నారు.పోస్టర్‌లో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ముఖ్య అంశాలు, సందేశాలు, అలాగే సేంద్రీయ ఎరువుల వినియోగం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం వంటి సూచనలు ప్రతిబింబించబడ్డాయి.ఈ పోస్టర్‌ను జిల్లాలోని అన్నిప్రభుత్వ కార్యాలయాలు,విద్యా సంస్థలు, గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల వద్ద ప్రదర్శించి ప్రజల్లో విస్తృత అవగాహనకల్పించేందుకుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి శ్రీమహమ్మద్ అబ్దుల్ ఘని ,ఎన్‌జిసి జిల్లా కోఆర్డినేటర్‌ఐ.సుదర్శన్‌రావు,ఎఎంఒ మహానంది, ప్లానింగ్‌కో ఆర్డినేటర్ శేఖర్ ,సిఎంఒ ప్రతాప్‌రెడ్డి,ఎఎస్‌సినారాయణమ్మ,జిసిడిఒ శుభలక్ష్మి పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పంటను సిద్ధం చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. తేమ శాతం అధికంగా ఉంటే ధర తగ్గే అవకాశాలు ఉన్నందున, ఈ విషయంలో జాగ్రత్తలు పాటించాలని, మొక్కజొన్న నాణ్యతపై కూడా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. అలాగే కేంద్రంలో తూకం, నిల్వ, రవాణా వంటి ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని, కొనుగోలు కేంద్రం వద్ద తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు .ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, తహసీల్దార్ సైదులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సీఈఓ కొమ్ము ఎల్లయ్య, ఆర్‌ఐ బలరాం, శివ, పీఏసీఎస్ మల్లేష్, రైతులు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం

**దేవరకద్ర, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే రైతులు ధాన్యం విక్రయించాలని దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి అన్నారు. దేవరకద్ర మండలం బస్వాయిపూర్, గద్దె గూడెం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి మండల అధ్యక్షులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సౌకర్యాలు కల్పించే దిశగా కొనుగోలు కేంద్రాన్ని మండల అధ్యక్షులు ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బస్వాయిపూర్ సర్పంచ్ శేఖర్ రెడ్డి, నార్లోనికుంట్ల సర్పంచ్ రామ్‌రెడ్డి, ఏపీఎం సునీత, విలేజ్ సెక్రటరీ రాఘవులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, నర్సింలు, గద్దెగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ జాఫర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో.. నేను సైతం



ఉపాధ్యాయుడు రవిందర్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మేయర్ గుమ్మాల మమత

- పుట్టిన నేలకు కొంతైనా మేలు చేయాలనే సంకల్పం
- తాను ఎంచుకున్న విద్యారంగంతో పాటు మహిళా అభ్యున్నతికి తోడ్పాటు
- ఆ ఉపాధ్యాయుడు..సమాజ సేవకుడు..
- టీచర్ రవీందర్ రెడ్డి పై ప్రత్యేక కథనం..





**మహబూబ్‌నగర్, కోయిలకొండ ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** ఆయన ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. పాఠాలు చెప్పడం తన పాఠశాలను నెంబర్ వన్‌గా నిలపడం, వెనుకబడిన విద్యార్థులను ముందుకు రాణించేలా చేయడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. మారుతున్న పరిస్థితులకనుగుణంగా విద్యార్థులు సమాజం మారాలని సంకల్పించారు. ఆ దిశగా అడుగులు వేస్తున్నారు కోయిలకొండ కు చెందిన ఉపాధ్యాయుడు రవీందర్ రెడ్డి. రవీందర్ రెడ్డి బోడోని గుట్ట తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గా పనిచేస్తున్నారు. బడి బాగుపడాలి బావుండాలి ఆ బడులలో చదివే బడుగు బలహీన వర్గాల పిల్లలు బాగుపడాలి అనేది ఒకటైతే తను పుట్టిన సొంత నెలకు ఏదైనా మేలు చేయాలని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, గ్రామీణ ప్రాంతంలో ఉపాధి లేని మహిళలకు ఆర్థికంగా బలపడేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలనే సంకల్పంతో అడుగులు వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయంరాని పొలాలకు వెళ్లలేని నిరుపేద మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశం తో కట్టుమిషన్ నేర్పించి వారికి ఉచితంగా కట్టుమిషన్ ఇవ్వడం వారి సొంతకాళ్ల పై వారు నిలబడేటట్టు చేస్తున్నారు. ఇప్పటికే గార్లపాడులో కుట్టు మిషన్ నేర్పించిన కొందరు మహిళలు స్థానికంగానే సొంతంగా షాప్ నిర్వహిస్తూ సొంత ఊరిలోనే నెలకు రూ.10నుంచి 20వేల వరకు సంపాదించుకుంటున్నట్లు చెబుతున్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జిల్లాల పూరర్విభజనలో కోయిలకొండ మండలం నారాయణ పేటలో కలపకుండా మండలం లోని వివిధ పార్టీల నాయకులను సమన్వయ పరిచి మహబూబ్ నగర్ జిల్లాలోనే సొంత మండలం కొనసాగేటట్టు ఉద్యమాన్ని చేయించి సాధించుకున్నాడు.

**సమాజ, గ్రామ సేవలో:** అంగన్‌వాడీ పిల్లలకు ఉచిత దుస్తులు ఇప్పించడం ,పదవ తరగతి పిల్లలకు ప్రేరణ తరగతులు నిర్వహించడం, 10 వ తరగతి పిల్లలకు ఫ్రీ ట్యూషన్ చెప్పించడం, 10వ తరగతి పిల్లలకు ప్రతిభ పరీక్షలు నిర్వహించడం, వేసవి సెలవులలో ప్రభుత్వ బడి పిల్లలకు ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ ఇవ్వడం, 8వతరగతి ప్రభుత్వ బడి పిల్లలకు ఉపకారవేతనం కొరకు కేంద్రం నిర్వహించే ఎన్.ఎం.ఎం.ఎస్ టెస్ట్ కు పిల్లలు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వడం, ప్రభుత్వ బడి పిల్లలకు 45 రోజులపాటు ఎస్‌ఎస్సి క్యాంపు నిర్వహణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరుపేద మహిళలకు ఉచిత కట్టుమిషన్ శిక్షణ ఇచ్చి వారికి ఉచితంగా మిషన్ ఇప్పించడం, తెలంగాణ సాధన ఉద్యమంలో... కోయిలకొండ మండలం మహబూబ్ నగర్‌లో నే కొనసాగే విధంగా ఉద్యమంలో అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేసి సాధించడం.



మహిళలకు కుట్లు, అల్లికలపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

### పుట్టిన గడ్డకు కొంతైనా సేవ చేయాలనే..

మాది కోయిలకొండ మండలం గార్లపహాడ్ గ్రామపంచాయతీ. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అన్న నానుడిని నిజం చేయాలనే ఉద్దేశంతో గ్రామీణ స్థాయి నుంచి ఆర్థిక వనరులను సృష్టించేందుకు నా వంతుగా ప్రయత్నం చేస్తున్నాను. వందేమాతరం ఫౌండేషన్ సహకారంతో గ్రామంలో కుట్టు మిషన్ అల్లికలు శిక్షణ ఇప్పిస్తున్నాను. శిక్షణ పొందిన మహిళలు తాము సొంతంగా ఇండ్లలోనే కుట్లు అల్లికలు చేసుకుంటూ నెలకు రూపాయలు పదివేల వరకు సంపాదిస్తున్నారంటే నాకు సంతోషాన్ని కలిగించింది. ఓవైపు పాఠశాల బాధ్యతలు తీసుకుంటూనేమరోవైపు సొంత గ్రామానికి సమాజానికి కొంతైనా సేవ చేయాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నాను.

— రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, గార్లపహాడ్



## ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలి

- జిల్లా విద్యా అధికారి రమేష్ కుమార్
- కేజీబీవీ పాఠశాలను, ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా విద్యా అధికారి

**కొల్లాపూర్, ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** కొల్లాపూర్ పట్టణంలో మంగళవారం జిల్లా విద్యా అధికారి (డిఇఒ) రమేష్ కుమార్ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షా కేంద్రాలను సందర్శించి, పరీక్షల నిర్వహణపై సమగ్రంగా పరిశీలన నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పర్యవేక్షణ విధానం, నియమ నిబంధనల అమలు వంటి అంశాలను ఆయన సవి వరంగా పరిశీలించారు. ఎక్కడా అవకతవకలు జరగకుండా అధికారులు అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సిబ్బంది విధులు నిర్వ హిస్తున్న తీరు, ప్రశ్నాపత్రాలభద్రత, సమయపాలన వంటి అంశాలపై కూడా డిఇఓ ప్రత్యేక దృష్టి సారించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికిఅవసరమైన అన్ని ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన ఆకస్మికంగా కొల్లాపూర్ కేజీబీవీ పాఠశాలను సందర్శిం చారు. అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించారు. వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం, మెనూ అమలు వంటి అంశాలను తనిఖీ చేసి, నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనంఅందించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థు లతో నేరుగా మాట్లాడిన ఆయన, వారి సమస్యలు, అవసరాలు గురించి తెలుసుకున్నారు. హాస్టల్ సౌకర్యాలు,చదువు పరిస్థితులు,భోజనం నాణ్యతపై విద్యార్థుల అభిప్రా యాలను తెలుసుకుని, ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. తదుపరి కల్వకోల్ ప్రాథమిక పాఠశాలను కూడా డిఇఒ తనిఖీ చేశారు.అక్కడ బోధన విధానం,విద్యార్థుల హాజరు,పాఠశాల వసతులు వంటి అంశాలను పరిశీలించి, ఉపాధ్యా యులకు అవసరమైన సూచనలు చేశారు.పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని,విద్యార్థుల అభ్యాసంపై ప్రత్యేకదృష్టి పెట్టాలని సూచించారు. మొత్తంగా జిల్లాలో విద్యా ప్రమా ణాలను పెంచడం, పరీక్షల నిర్వహణను పారదర్శకంగా కొనసాగించడం కోసం ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని డిఇఒ తెలిపారు.



కేజీబీవీ పాఠశాలను, పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన డిఇఓ



కజీబీవీ పాఠశాలను, పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన డిఇఓ



మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలిస్తున్న డిఇఓ

## క్రీడాకారులకు ప్రోత్సాహం

- గ్రామీణుల ప్రతిభను వెలికి తీసేందుకే ఖేల్ మహోత్సవ్ పోటీలు
- యువత పెద్ద ఎత్తున పాల్గొనడం హర్షణీయం
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతంలో క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకే కేంద్ర ప్రభుత్వం ఖేల్ మహోత్సవ పోటీలను ప్రారంభించిందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఎంపీ డీకే అరుణ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలోజరుగుతున్న ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్‌లో భాగంగా ఫైనల్‌కి చేరిన మహబూబ్‌నగర్, జడ్చర్ల క్రికెట్ జట్లను అభినందించి, ఫైనల్ మ్యాచ్‌టాస్ వేసి పోటీలను ప్రారంభిం చారు. ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఖేల్ మహోత్సవ పోటీలకు గ్రామీణ క్రీడాకారులు యువత పెద్ద ఎత్తున మద్దతు పలుకుతూ పోటీల్లో పాల్గొ నడం హర్షణీయం అని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ సంసద్ ఖేల్ మహోత్సవ పోటీల కన్వీనర్ ముచ్చర్ల జనార్ధన్ రెడ్డిని ఈ సందర్భంగా ఆమె అభినందించారు. క్రీడా పోటీల ముగింపు ఉత్సవానికి రాష్ట్ర గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు ఆమె వెల్లడించారు.



విజేతగా నిలిచిన మహిళల జట్టు

**విన్నర్ మహబూబ్‌నగర్, రన్నర్ జడ్చర్ల....**

క్రికెట్, వాలీబాల్ ఫైనల్ మ్యాచ్ లు మహబూబ్‌నగర్ వర్సెస్ జడ్చర్ల ఉత్కంఠ భరితంగా జరిగాయి. ఫైనల్ మ్యాచ్‌లో మొదటిబహుమతి మహబూబ్‌నగర్ జట్టు, రెండవ బహుమతి జడ్చర్ల జట్టు గెలిచారు. కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో మొదటి బహుమతి మక్తల్, రెండవ బహుమతి జడ్చర్ల గెలిచారు. ఖోఖో మహిళల ఫైనల్ మ్యాచ్ మొదటి బహుమతిమక్తల్, రెండవ బహుమతి జడ్చర్ల గెలిచారు. కార్యక్రమంలో బొక్క బాల్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, ముంగి నవీన్ రెడ్డి, బొక్క నవీన్, భరత్, ఆనంద్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఎంపి డికె అరుణ

## సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

### ఉపకులపతి ఆచార్య జీఎన్ శ్రీనివాస్




వేసవికాల ప్రత్యేక శిబిరాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఉపకులపతి ఆచార్య జీఎన్ శ్రీనివాస్

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** విద్యార్థి దశ నుంచే సేవా గుణాన్ని అలవర్చుకోవడం ఎంతో అవసరమని పాలమూరు విశ్వ విద్యాలయ ఉపకులపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. పాలమూరు యూనివర్సిటీలోని యూనివర్సిటీ పీజీ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–I వాలంటీర్లు లక్ష్మీపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న 7 రోజుల ప్రత్యేక శిబిరానికి బయలుదేరారు. ఈ సందర్భంగా వాలంటీర్లను ఉద్దేశించి ఉపకులపతి ఆచార్య జీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకొని, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలు కనుగొనడానికి కృషి చేయాలని సూచించారు. అదే విధంగా, పాఠశాల విద్యార్థులు మధ్యలో చదువు మానేయకుండా తల్లి దండ్రులను చైతన్యపరచాలని, అక్షరాస్యత శాతం పెంపుదల కోసం ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు కృషి చేయాలని తెలిపారు. వేసవికాలంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ గ్రామస్తులతో మమేకమై సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.రిజిస్ట్రార్ ఆచార్య రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు గ్రామస్తులకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని గుర్తించి, గణాంకాలతో సహా సంబంధిత అధికారులకు తెలియజేయాలని వాలంటీర్లను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డా.కె. ప్రవీణ, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఎన్. చంద్రకిరణ్, ప్రిన్సిపాల్ చైర్మన్ డా. మధుసూదన్ రెడ్డి, ప్రోగ్రాం అధికారి డా. రవికుమార్, అధ్యాపకులు డా. సిద్ధరామ గౌడ్, బోధనేతర సిబ్బంది రఘు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్‌లో "ఫ్రెష్ మీట్" ప్రారంభోత్సవం



ఫ్రెష్ మీట్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మేయర్, డిప్యూటీ మేయర్ తదితరులు

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన "ఫ్రెష్ మీట్" విక్రయ కేంద్రాన్ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ ఎం. సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి జనరల్ సెక్రటరీ వినోద్ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాంసం నాణ్యతను చూడడానికి మేయర్ ప్రాన్, చేప, మాంసం కొనుగోలు చేసారు.ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.నూతన వ్యాపారాన్ని ప్రారంభించిన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.



## బ్రిడ్జిపై భారీగా ట్రాఫిక్ జామ్

**రాజాపూర్,ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులకు రాజాపూర్ మండల కేంద్రం శివారులోని బ్రిడ్జిపై ఓభారీ వృక్షం రోడ్డుపై పడింది. అలాగే ఓ ఆటో ప్రమాదానికి గురై రోడ్డుపై పడడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ అయింది.రాజాపూర్‌పోలీసులు,జాతీయరహదారి అధికారులు రోడ్డుపైపడ్డవాహనాన్ని,చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న పోలీసులు